సాక్షి ఒడిశా

సోమవారం । 28 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,63,576లు, బంగారం 1 గ్రాముల 50 మిల్లీగ్రాములు, వెండి 9గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పేదల అభ్యున్నతే లక్ష్యం

పేదల అభివృద్ధే సీఎం నవీన్ పట్నాయక్ ధ్యేయమని 5–టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ తెలిపారు.

- 8లో



పరిమళించిన మానవత్వం

కులవృత్తిదారులకు తెలుగు నాయీబ్రాహ్మణులు ఆసరాగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి నెలకు రూ.1000 చొప్పున అందజేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

మృతుని కుటుంబానికి కోటి రూపాయలు



బ్యాంక్ అధికారి నుంచి కోటి చెక్కును అందుకుంటున్న లీనా ప్రధాన్

జయపురం: జయపురం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతాదారుడు రంజిత్ ప్రధాన్ మరణించటంతో అతడి కుటుంబానికి బ్యాంకు ప్రతినిధులు కోటి రూపాయల చెక్కు అందజేశారు. రంజిత్ ఈ బ్యాంక్‌లో లైఫ్ టెర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవడంతో ఈ మొత్తం మంజూరైందని పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ నాయిక్ రంజన్ పురోహిత్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ నెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ సర్కిల్ మేనేజర్ శోభన్ పాత్రో, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసంఘంలో పికప్ మోటారు డ్రైవర్ల యూనియన్ చేరిక

జయపురం: జయపురం జగత్ జననీ పికప్ మోటారు డ్రైవర్ల సంఘం జయపురం డ్రైవర్ మహాసంఘంలో చేరేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్మిక సంఘం భవనంలో సంఘ అధ్యక్షుడు జుధిష్టర్ రౌళో అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డ్రైవర్ల మహాసంఘంలో చేరాలని, సంఘ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించాలని, రానున్న విశ్వకర్మ పూజను అంగరంగ వైభవంగా జరపాలని నిర్ణయించారు. సమావేశంలో భువనకుమార్, సంతోష్‌కుమార్ శెట్టి, ప్రేమనాథ్ భిశాయి, ధనుర్జన్ పొరజ, జగన్నాథ్ గౌడ, నవీన్ సుహార్, శరత్ నాయిక్, కృష్ణారావు, ఎస్‌డీ అసలామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన విభాగాలు పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలేటెందు

కొరాపుట్: అధికార బీజూ జనతాదల్ పార్టీలో విద్యార్థి, యువజన విభాగాలను మరింత పటిష్టం చేయాలని కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలేటెందు రంజన్ శెరి పిలుపునిచ్చారు. ఆదివారం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితిలో పార్టీ విద్యార్థి యువజన విభాగాల సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు విద్యార్థి, యువజన విభాగాలపై దృష్టి సారించాలన్నారు. కొత్త ఓటర్లపై దృష్టి సారించి బలోపేతం కావాలన్నారు. సీనియర్ నాయకులతో పరిచయం చేయించాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక, సునాబెడా మున్సిపల్ చైర్మన్ రాజేంద్ర పాత్రో పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోరు



ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్

పర్లాకిమిడి: ఈ నెల 30న జరగనున్న పర్లాకిమిడి పురపాలక సంఘం స్వపరిపాలన దినోత్సవం పురస్కరించుకుని స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో ఆదివారం ప్రెస్ క్లబ్ వెర్సస్ పురపాలక సంఘం సిబ్బంది క్రికెట్ మ్యాచ్ ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. తొలుత ప్రెస్‌క్లబ్ సభ్యులు ఏబీ జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన ప్రెస్‌క్లబ్ (ఎ)తో మున్సిపల్ సిబ్బంది–11 జట్టు బరిలోకి దిగింది. మున్సిపల్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 179 పరుగులు చేయగా, మీడియా జట్టు 120 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెఠి ముఖ్యఅతిథిగా విచ్చేయగా, కె.రామస్వామి, కె.చందు, శుభం రౌత్ అంపైర్లుగా వ్యవహరించారు. విజేతలకు ఈ నెల 30న బహుమతి ప్రదానం చేస్తామని పురపాలక ఈఓ వనమాలి శత్పథి తెలిపారు.



పర్లాకిమిడి పురపాలక సంఘం లెవన్ జట్టుతో చైర్మన్ నిర్మలా శెఠి

రక్తదానం.. ప్రాణదానం



అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఎం.సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిప్రియనగర్‌లోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 యూనిట్ల రక్తం సేకరించారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

- రాయగడ

నాలుగు అడుగుల అలుగు



నగర ఉపఖండం పుల్తా గ్రామంలో నాలుగు అడుగుల అలుగు కలకలం రేపింది. స్థానికులు బరంపురం అటవీ శాఖకు సమాచారం ఇవ్వగా అధికారుల బృందం చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దిగపండి సమీపంలోని చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

- బరంపురం

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



నిజ శ్రావణ మాస శుక్ల ఏకాదశి సందర్భంగా ఆదివారం స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామ్‌జీ ఆచార్యులు ఆధ్వర్యంలో మహిళలు రమా సత్యనారాయణ వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. స్వామివారికి సుప్రభాత పూజలు, అభిషేకాలు చేశారు.

- రాయగడ

ఉరుములు.. మెరుపులు!

- ఐదు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలకు అవకాశం
- యెల్లో అలర్ట్ జారీ చేసిన ఐఎండీ



భువనేశ్వర్ : రాష్ట్రంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా వర్షం జాడ లేకుండా పోయింది. అయితే రానున్న ఐదు రోజులు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం పసుపు హెచ్చరిక జారీ చేసింది. సోమవారం ఉదయం 8.30 గంటల వరకు మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, నవరంగ్‌పూర్, కలహండి, గజపతి, గంజాం, కంధమల్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్ జిల్లాల్లో కొన్ని చోట్ల, మిగిలిన ప్రాంతాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 30న నువాపడా, బొలంగీర్, బర్‌గఢ్, ఝూర్సుగుడ, సంబల్‌పూర్, అంగుల్, దేవ్‌గఢ్, సుందర్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాలలో ఒకటి, రెండు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన వానలు కురిసే సంకేతంతో పసుపు హెచ్చరిక జారీ చేసింది. మారుమూల ప్రాంతాల్లో కొన్ని చోట్ల, కోస్తా జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం పడే సూచన ఉన్నట్లు సమాచారం. మరుసటి రోజు మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం, కంధమల్, నయాగఢ్, కటక్, ఖుర్దా, బౌధ్, అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, మయూర్‌భంజ్ జిల్లాలలో ఒకటి, రెండు చోట్ల ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

అతి తక్కువ వర్షపాతం..

గతంలో కుంభ వృష్టి నమోదైన అత్యధిక ప్రాంతాల్లోనూ ఈ సీజన్‌లో వర్షాభావం తాండవిస్తోంది. రుతుపవనాల సీజన్‌లో ఈ నెల 27 వరకు ఒడిశా సాధారణ వర్షపాతం తక్కువగా నమోదైంది. రాష్ట్రంలో ఈ సమయానికి సగటు సాధారణ వర్షపాతం 870.5 మిల్లీమీటర్లు కాగా వాస్తవ వర్షపాతం 780.9 మిల్లీ మీటర్లుగా నమోదైంది. నామమాత్రంగా ఒక జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. మరో 18 జిల్లాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అయ్యింది. మిగిలిన 11 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఖుర్దా, పూరీ, కటక్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, జాజ్‌పూర్, గంజాం జిల్లాలతో రాష్ట్రంలోని దక్షిణాది ప్రాంతాల్లోని మరికొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతం తాండవిస్తుంది.

జయహో జయంతో



జయంతో ఫొటోలు చూస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

- చంద్రయాన్–3 ప్రాజెక్టులో మల్కన్‌గిరి యువకుడు జయంతో కుమార్
- ఆనందంలో కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: భారత్‌లో ఇటీవల విజయవంతమైన చంద్రయాన్–3 ప్రాజెక్టులో మల్కన్‌గిరి జిల్లా పోట్టేర్ గ్రామానికి చెందిన జయంతో కుమార్ హల్దర్ కీలకపాత్ర పోషించాడు. మావోయిస్టు ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో పిల్లల చదువులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో తండ్రి జయదేవ్ హల్దర్ తన కుమారుడిని కొరాపుట్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయంలో చేర్పించారు. అందులో చేరిన జయంతో 6 నుంచి 10 వ తరగతి వరకు విద్యనభ్యసించారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో 2008 నుంచి 2012 వరకు బీటెక్‌లో చేరి మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. 2012లోనే ఏరోస్పేస్‌లో ఇంజినీర్ ఉద్యోగంలో చేరారు. అదే ఏడాది నుంచి 2017 వరకు ఇస్రో(శ్రీహరికోట) క్రయోజనిక్ ప్రోపెల్లెంట్‌లో చేరి రాకెట్ మెకానికల్ శాస్త్రవేత్తగా కొనసాగారు. చంద్రయాన్–3 ప్రాజెక్టులో సిబ్బందికి ప్రాజెక్టు ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇంతటి ఘన విజయంలో కుమారుడు పాలుపంచుకున్నందుకు తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జయంత్ తండ్రి కొన్నాళ్ల కిందటే చనిపోయారు. ప్రస్తుతం తల్లి, భార్య ఉన్నారు.



జయంతోకుమార్

డబ్బులు ఇవ్వలేదని మారణాయుధాలతో దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



నిందితుడు కుసు పొరజ



నిందితుడు డొంబురు పొరజ

జయపురం: దాదాగిరి మామూలు ఇవ్వలేదనే ఆగ్రహంతో ఇద్దరిపై తండ్రీకొడుకులు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు స్టేషన్ అధికారి ఈశ్వర తండి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. జయపురం సమితి దుబులి బంగ్లాగుడకు చెందిన తపన సర్కార్ తపన సర్కార్ ఈ నెల 25న సాయంత్రం దులులి (బంగ్లాగుడ) కూడలి వద్ద నిలుచుని కొందరితో మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో తండ్రీకొడుకులు కుసు పొరజ, డొంబురు పొరజలు చేరుకొని దాదాగిరి మామూలు రూ.50 వేలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. అందుకు నిరాకరించటంతో ఆగ్రహంతో వ్యాపారిని బూతులు తిడుతూ మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. తపన సర్కార్ తలపై ఇనుప రాడ్డుతో బలంగా కొట్టారు. తలకు తీవ్ర గాయం కావడంతో బంధువులు కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో తపనను చేర్పించి చికిత్స అందించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న నిందితులు బంగ్లగుడ వెళ్తూ బైక్‌ను ఢీకొంటారు. అక్కడే ఉన్న మహిళపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరిది దుబులి గ్రామంగా గుర్తించారు. దాడిలో వాడిన ఇనుప రాడ్డు, బైక్‌లను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జయపురం సబ్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రమేష్ పాత్రోకు సన్మానం



రమేష్ పాత్రోను సన్మానిస్తున్న అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్

జయపురం: ఒడిశా రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి ఎన్నికైన ఏకైక న్యాయవాది పిట్టా రమేష్ పాత్రోను శనివారం కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్(జయపురం) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో గల బార్ అసోసియేషన్ మందిరంలో అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది న్యాయవాదులు

31 నుంచి భవానీపట్న– భువనేశ్వర్ విమానయానం

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్న, రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ మధ్య ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. కలహండి ఉత్కెలా విమానాశ్రయం నుంచి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ఈ నెల 31 నుంచి విమానయానం సేవలు ప్రారంభమవుతాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రకటించింది. ఈ నెల 7న విమానయాన రవాణాకు ఉత్కెలా విమానాశ్రయానికి అవసరమైన లైసెన్స్ మంజూరు చేసి త్వరలో ఈ సేవలు ప్రారంభమవుతాయని వెల్లడించింది.

రాయ్‌పూర్‌కు విస్తరణ..

ఉత్కెలా, భువనేశ్వర్ విమానాశ్రయం మధ్య ప్రారంభమైన విమానయాన సేవలు తదుపరి దశలో ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్ వరకు విస్తరిస్తారు. తొలి దశలో ఇండియావన్ ఎయిర్ ఉత్కెలా బీపీఐఏ మధ్య తొమ్మిది–సీట్ల విమానం రవాణా అవుతుందని తెలిపారు. భవానీపట్నలోని ఉత్కెలా విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ, రన్‌వే, టెర్మినల్, భవనాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.162 కోట్లు వెచ్చించింది. ఉత్కెలా విమానాశ్రయం నుంచి విమాన కార్యకలాపాలు కనెక్టివిటీ, వాణిజ్యం, పర్యాటక రంగాల్ని అభివృద్ధి పరుస్తాయని, ప్రాంతీయుల ఆకాంక్షలను నెరవేరుస్తాయని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పట్నాయక్, ఐఐసీ కమలాకాంత్

రాయగడ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లొథన్–0.3 పేరిట నిర్వహించిన సైకిల్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, సదరు పోలీస్ స్టేషన్ ఐఐసీ కమలాకాంత్ కుహరొ, జిల్లా క్రీడా శాఖాధికారి షేక్ ఆలీనూర్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడా రంగంలో యువతకు ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి ర్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.అనంతరం సద్భావనా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి సైకిల్ ర్యాలీ ప్రారంభమైంది. సుమారు ఐదు వందల మందికి పైగా యువత ర్యాలీలో పాల్గొన్నారు. సైకిల్ లేని వారికి అజిత్ జైన్ సైకిల్ మార్ట్ యజమాని 50 సైకిళ్లు సమకూర్చారు. కలెక్టర్ కార్యాలయం, సమితి కార్యాలయం, ఎఫ్‌సీఐ పెట్రోల్ బంక్ వరకు చేరుకుని తిరిగి మెయిన్ రోడ్డు మీదుగా మెయిన్ మార్కెట్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో మార్వాడీ యువమంచ్ రాయగడ శాఖ అధ్యక్షుడు వినిత్ అగర్వాల్, కార్యదర్శి శైలేష్ జైన్, కోశాధికారి ఉదిత్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్న యువతులు



ర్యాలీలో పాల్గొన్న యువకులు

సార్వత్రిక ఎన్నికలు బహిష్కరిస్తాం



సమావేశంలో పాల్గొన్న జొడియా సంఘ ప్రతినిధులు

రాయగడ: జొడియా సంప్రదాయ ప్రజలను ఆదివాసీలుగా గుర్తించకపోతే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని 86 గ్రామాలకు చెందిన జొడియా తెగ నాయకులు ప్రకటించారు. జిల్లాలోని కాసీపూర్ సమితి బగిరిజోల గ్రామంలో ఆదివారం జొడియా సమాజం ప్రతినిధుల సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. జిల్లాలోని కాసీపూర్ ప్రాంతంలోఅత్యధిక శాతం మంది జొడియా సంప్రదాయ ప్రజలు నివసిస్తున్నారు. ఈ తెగకు చెందిన వారిని ఆదివాసీలుగా గుర్తించకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేక ఇబ్బందులు పడుతున్నారని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేక ఏళ్ల విన్నవిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమన్నారు. అధికారులు, నాయకుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల ముందే జొడియా తెగను ఆదివాసీలుగా గుర్తించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని సంఘ ప్రతినిధులు అఖిల చంద్ర జొడియా, భవాని శంకర్ జొడియా, నాథొ జాని, ఘసేయి జొడియా, సురేంద్ర జొడియాలు స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పలు స్థానాలకు విశాఖపట్నం రేంజి వీఆర్‌లో ఉన్న సీఐలు విధుల్లో చేరనున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఎస్.కామేశ్వరరావు శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్ అటాచ్డ్ గార పీఎస్‌కు, పి.కోటేశ్వరరావు శ్రీకాకుళం డీఎస్బీ (జిల్లా స్పెషల్ బ్రాంచి), శీరా భాస్కరరావు శ్రీకాకుళం దిశా పీఎస్‌కు, ఎస్.రామకృష్ణ శ్రీకాకుళం వీఆర్‌కు బదిలీపై రానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్వతీ పురం (మన్యం) జిల్లా వీఆర్‌కు ఎస్.వేణుగోపాలరావుకు పోస్టింగ్ ఇచ్చారు.

అంతర్జాతీయ పోటీలకు కిరణ్‌కుమారి యాదవ్



తల్లిదండ్రులతో కిరణ్‌కుమారి యాదవ్

సోంపేట: అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న వరల్డ్ లాక్ క్రాస్ ఉమెన్స్ సిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు లండ కిరణ్‌కుమారి యాదవ్ ఎంపిక య్యారు. కెనడాలోని అక్టోబర్ 6, 8 తేదీల్లో జరుగనున్న పోటీలకు దేశం నుంచి ఆరుగురిని ఎంపిక చేయగా అందులో కిరణ్‌కుమారి ఒకరు. ఈమెది సోంపేట మండలం మామిడిపల్లి గ్రామం. కుమార్తె అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో తండ్రి సూర్యనారాయణ ఇంటి సభ్యులతో సంబరం జరుపుకున్నారు. తన కుమార్తెకు విద్యను నేర్పిన గురువు సురేంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు సార్వత్రిక సూత్రాలు పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో రైతులు సార్వత్రిక సూత్రాలు పాటించాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సాగుపై మూడో రోజు శిక్షణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

గొంతు నులిమి చంపేశారు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన హత్య స్థానికంగా కలకలం రేపుతోంది. నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఇంటి నర్సింగరావు అలియాస్ నేతాజీ (53)ని గొంతు నులిమి చంపేశారు. మృతుడిపై గతంలో రౌడీషీట్ ఉండడం, కుటుంబంలో ఆస్తి తగాదాలు నడుస్తుండడం, కుటుంబ సభ్యులతోనే ఆర్థిక లావాదేవీలు ఉండడంతో ఆయన హత్యపై ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఏపీహెచ్‌బీ కాలనీలో ఉంటున్న నర్సింగరావుకు పాతికేళ్ల కిందట రూప అనే మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె హైదరాబాద్‌లో జాబ్ చేస్తుండగా.. మరొకరు బీటెక్ చదువుతున్నారు. నర్సింగరావు వ్యాపారాల్లో నష్టపోవడంతో ఆయన భార్యే కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నారు. వారి ఎదురింటిలో ఉన్న మహిళకు ఈ మధ్యనే పక్షవాతం రావడంతో.. ఆమెకు సపర్యలు చేసే పనిలో నర్సింగరావు భార్య రాధ చేరారు. నెల జీతానికి అక్కడ పనికి కుదిరి రాత్రిళ్లు వారి ఇంటిలోనే నిద్రించేవారు. శనివారం రాత్రి కూడా ఇంటి లో పనులన్నీ ముగించుకుని ఎప్పటిలాగానే చిన్నకుమార్తెతో పాటు నిద్రపోవడానికి ఎదురింటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూస్తే మంచంపై భర్త చలనం లేకుండా పడి ఉన్నారు. తాగి పడుకున్నారేమో అని ఆమె పట్టించుకోలేదు. అయితే ఎంత సేపటికీ ఆయన లేవకపోవడంతో అక్కడే పాన్‌షాపు నడిపే నర్సింగరావు స్నేహితుడికి విషయం చెప్పారు. అతను వచ్చి చూసి నర్సింగరావు మృతి చెందినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన డీఎస్పీ యర్రగుంట శృతి, సీఐ లెంక సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలికి చేరి మృతదేహాన్ని పరిశీలించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. మెడపై మాత్రం గట్టిగా అదిమినట్లు గుర్తులు ఉండడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు నిర్ధారించారు.

అనుమానాలెన్నో..

నర్సింగరావుపై 2005కు ముందు రౌడీ షీట్ ఉండేది. దీనికి తోడు కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈయనకు ఐదుగురు తోబుట్టువులు ఉన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల రూ.5.20 కోట్ల విలువైన స్థలంపై వీరు కోర్టుకు కూడా వెళ్లారు. ఈ స్థలాన్ని తన తండ్రి తనకే రాసిచ్చేశాడంటూ నర్సింగరావు రెండో సోదరుడు హరిప్రసాద్ విక్రయానికి పెట్టడంతో మూడేళ్ల కిందట మిగతా వారంతా కోర్టుకు వెళ్లారు. ఈ గొడవలే హత్యకు దారి తీశాయేమో అన్న కోణంలో పోలీసు లు విచారిస్తున్నారు. అలాగే నర్సింగరావు మొదటి సోదరి మంజుల భర్త చనిపోయాక వారికి రూ.20 లక్షలు వచ్చాయి. ఆ డబ్బులు ఫైనాన్స్‌కు తిప్పుతానంటూ నర్సింగరావు అడిగి తీసుకున్నాడు. తర్వాత నష్టపోయాడు. దీంతో మంజుల పెద్ద కుమారుడు కమల్, తన మిత్రుడు సాయితో కలిసి నర్సింగరావుతో గొడవ పడ్డారు. అతడి బండిని కూడా తగులబెట్టేశారు. ఈ కోణంలోనూ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం



సభలో మాట్లాడుతున్న 5-టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్

- రూ.1670 కోట్లతో గంజాం అభివృద్ధి
- మహానది-రూశికుల్యా నది అనుసంధానం
- 5-టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ వెల్లడి

బరంపురం : ఒడిశాలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలన సాగిస్తున్నారని 5-టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యాన్ చెప్పారు. సీఎం నవీన్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా, బరంపురం నగరం అంబపువా మైదానంలో బిజు జనతా దళ్ ఏర్పాటు చేసిన మిషన్ శక్తి మహిళా స్వాశక్తికరణ కార్యక్రమంలో కార్తికేయ పాల్గొన్నారు. రూ.1670 కోట్ల నిధులతో గంజాం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ రాష్ట్ర గౌరవ ప్రతిష్టలు పెంచుతున్నారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రంలోని ఆరు కోట్ల ప్రజల ఆరాధ్య నాయకుడుగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నిలిచారని పేర్కొన్నారు. గంజాం జిల్లాలోని కళ్లికోట్, అస్కా, బంజనగర్, హింజిలికాట్, కుదలా, కబిసూర్యనగర్, పులసరా, బుగడా, జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్‌లతో పాటు బరంపురం నగర వాసుల ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించేందుకు మహానది-రూశికుల్యా నది అనుసంధానం చేయనున్నట్టు చెప్పారు. అనంతరం ఓడీఆర్‌పీ కింద నిర్మించిన ఉచిత గృహాల పట్టాలను, మధుసూదన్ వృద్ధాప్య పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, బీజేడీ నాయకులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్న దృశ్యం



నదుల అనుసంధానం వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

ఉత్సాహంగా న్యాయవిద్య వేడుకలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

మల్కన్‌గిరి: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాంస్కృతిక భవనంలో న్యాయ విద్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్జి లీగల్ సర్వీసెస్ అథారిటీ అధినేత అజింతా సోడాంగి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 28 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిగాయి. అంతకుముందు 'గృహహింస, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టాల ఆవశ్యకతను వివరిస్తూ నాటిక ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ జ్యుడీషియల్ ఆఫీసర్ సత్యప్రియా దాస్, సబ్ డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ వృధప్రకాష్ నాయక్, గ్రామ మేజిస్ట్రేట్ దేవేంద్రనాథ్ బాగ్, జిల్లా సీనియర్ జార్జ్ విజయ్‌కుమార్ దాస్, సీనియర్ జార్జి భవితాదాస్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లాంబోధర్ తురుక్, జిల్లా బార్ అసోసియేషన్ ఎడిటర్ నరసింగ్ చరణ్ మాహంతి పాల్గొన్నారు.



వేదికపై అతిథులు



నాటికలో పాల్గొన్న విద్యార్థులు షీల్డులు అందజేస్తున్న నిర్వాహకులు

తెలంగాణలో ఎమ్మెల్యే కోడూరు పర్యటన



ఎమ్మెల్యే నారాయణరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వారం రోజులుగా తెలంగాణ రాష్ట్రం ములుగు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున ములుగు నియోజకవర్గంలోని కొత్తగుడ, రంగరాం, గోవిందరావుపేట, వెంటాపురం తదితర ప్రాంతాల్లో తెలుగు ఓటర్లను కలిసి కేంద్ర పథకాలను వివరిస్తున్నారు.

అనేకమంది ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒడిశా నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ అపరాజితా షడంగిలు తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి పర్యటిస్తున్నారు.

● రాఖీల సందడి



మార్కెట్‌లో రాఖీ సందడి కనిపిస్తోంది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 31న రాఖీ పండగ జరగనుంది. ఈ సందర్భంగా రూ.25 నుంచి రూ.1000ల వరకు ధర కలిగిన రాఖీలు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న పూసలతో తయారుచేసిన రాఖీల నుంచి పెద్ద బొమ్మలతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న రాఖీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

-శ్రీకాకుళం కల్చరల్



విద్యార్థులకు పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: ఈ నెల 31న జరగనున్న స్వయం శాసన దినోత్సవాల సందర్భంగా జయపురం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ తెలిపారు. చిత్రలేఖన సబ్‌జూనియర్ విభాగంలో గౌతమ పూజారి, సోనీ సింగ్, సోనమ్ కుమారి తొలిమూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్ చిత్ర లేఖనం పోటీల్లో త్రిపాఠీ, అపరాజిత మహాపాత్రో, ఘెను పడాల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ఈ నెల 31న బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

పరిమళించిన మానవత్వం



పేద నాయిా బ్రాహ్మణునికి పింఛన్ కార్డు అందిస్తున్న సంఘం అధ్యక్షుడు ఎస్.గణేష్

- కులవృత్తిదారులకు ఆసరాగా నిలుస్తున్న తెలుగు నాయిాబ్రాహ్మణులు
- నెలకు రూ.1000 చొప్పున అందజేత

కొరాపుట్: ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ నబరంగపూర్‌లో స్థిరపడిన తెలుగు నాయిాబ్రాహ్మణులు అండగా నిలుస్తున్నారు. తమవంతు సాయం అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అసంఘటిత రంగంలో ఇంటి యజమాని ఆరోగ్య పరిస్థితి కోల్పోతే ఆ కుటుంబ ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి అండగా నిలుస్తూ నాయిాబ్రాహ్మణ సంఘం తరఫున నెలకు రు.1000 చొప్పున అందజేశారు. ఈ నెల నుంచే ఈ సాయం ప్రారంభించారు. నాయిాబ్రాహ్మణ వృత్తి చేస్తూ అనారోగ్యానికి గురై ఆ పని మానివేసిన వారికి ఈ భృతి జీవితాంతం అందుతుంది. చాలా కాలం కిందటే ఆంధ్రా నుంచి అనేక నాయిాబ్రాహ్మణ కుటుంబాలు జీవనోపాధి కోసం నబరంగ్‌పూర్ జిల్లాకు తరలివచ్చాయి. ఇలా వచ్చిన ఎస్.గణేష్ (ఘనీ) వీరందరిని ఒకతాటి పైకి తెచ్చారు. 2008లో నబరంగపూర్ బారిక్ సంఘం పేరిట సంఘంగా ఏర్పాటై ఐకమత్యంగా వారి సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. నాటి నబరంగ్‌పూర్ ఎంపీ ప్రదిప్ మజ్జి రు.3 లక్షలు, గత నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే మనోహర్ రంధారి రు.3 లక్షలు, ప్రస్తుత నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని రు.3 లక్షలు అందజేయడంతో సంఘ భవనం నిర్మించారు. నాయిా బ్రహ్మణ కుటుంబాల కార్యక్రమాలకు భవనం వినియోగించుకుంటున్నారు. ప్రతి సభ్యుడు నెలకు రూ.100 చొప్పున సంఘానికి అందజేస్తున్నారు. ఇలా వచ్చిన నిధులు సుమారు రు.5 లక్షల వరకు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ మొత్తంతో తాజాగా పింఛన్ పథకం ప్రారంభించారు. ఎవరైనా మృతిచెందితే అంత్యక్రియలకు రు.5000 అందజేస్తున్నారు.

నగరం మోసపోతున్న వేళ!

- ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న వారిలో అధికులు విద్యాధికులే
- పల్లెల్లో కంటే నగరాలు, పట్టణాల్లోనే ఈ తరహా మోసాలు అధికం
- ఇతర రాష్ట్రాలకు వెళ్లి మరీ దర్యాప్తు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : యాప్‌ల వాడకంపై సాటిలేని పెత్తనం. ఆన్‌లైన్ బ్రౌజింగ్ విషయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు తీసిపోని అవగాహన. అన్ని సామాజిక మాధ్యమాల్లో అకౌంట్లు. సెల్‌ఫోన్ గురించి లెక్చర్లు ఇచ్చేంత జ్ఞానం... కానీ ఏం లాభం.? ఇన్ని తెలిసీ నగర వాసులు సైబర్ వలలో సులభంగా చిక్కుకుపోతున్నారు. జిల్లాలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాల్లో పల్లెల కంటే పట్టణాలే అధికంగా మోసపోతున్నాయి. నిరక్షరాస్యుల కంటే విద్యాధికులే ఎక్కువగా అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

సరికొత్త టెక్నాలజీతో..

ఇంటర్నెట్ యుగంలో నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ప్రజలను ఎలా మోసం చేయాలన్న దానిపై రోజురోజుకీ అప్‌గ్రేడ్ అవుతున్నారు.రకరకాల మోసాలతో ప్రజలను ఏమార్చి బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తున్నారు. పల్లెల్లో కన్నా పట్టణాల్లో ఉన్న విజ్ఞానులే అత్యాశతో మోసపోతున్నారు. జిల్లాలో ఇలాంటి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు.. నేరస్తులను పట్టుకునేందుకు ఎస్పీ జీఆర్ రాధిక ఇతర రాష్ట్రాలకు ఇప్పటికే ఏడు బృందాలను పంపించారు. వెళ్లిన వారంతా కేసుల్లో ఉన్న 118 మందిని గుర్తించి (వెరిఫై చేసి) 40 మందికి 41-ఏ నోటీసులు జారీ చేసి వెనక్కి వచ్చారు. 70 కేసుల్లో 60 వరకు చార్జిషీట్లు సిద్ధం చేశారు. కేసులు ఫైనలైజ్ అయ్యాక కోర్టుకు మెమోలు సమర్పిస్తారు. ఈ డబ్బై కేసుల్లో మెజారిటీ కేసులు పట్టణాలకు చెందినవి కావడం గమనార్హం.



ఇలా మోసగిస్తున్నారు..

- ఎస్‌బీఐ యోనో అకౌంట్‌కు కేవైసీ అప్‌డేట్ అంటూ, సిమ్ కార్డు ఎక్స్పైరీ అయిపోయిందంటూ ఓటీపీలు అడిగి మోసం చేస్తున్నారు.
- ఓఎల్ఎక్స్ యాప్‌లో, గూగుల్ సెర్చ్‌లో టాస్క్‌లు, ఆ తర్వాత బహుమతులు, ఆ బహుమతులు దక్కించుకోవడానికి డబ్బులు వేయమనడం అంటూ ఓ పద్ధతిలో ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.
- హనీట్రాప్‌లు కూడా సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్నాయి. అమ్మాయిల పేరుతో వల వేయడం, ప్రేమలో దింపడం, డబ్బులు లాగేయడం జిల్లాలో కూడా జరిగాయి. శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యక్తి రూ.7 లక్షలు మోసపోయాడు.
- లండన్‌లో ఓ మహిళ (ఇక్కడోడే) ఎఫ్‌బీలో ఓ పోస్టు పెట్టి 'నాకు క్యాన్సర్ వ్యాధి వచ్చేసింది. కొద్దిరోజులే బతుకుతాను. నా వద్ద రూ. 2.5 బిలియన్ల డాలర్ల కరెన్సీ ఉంది. అనాథ శరణాలయానికి డొనేట్ చేసేస్తాను' అని రాయడంతో అది చూసిన శ్రీకాకుళం రూరల్‌కు చెందిన వ్యక్తి ఆ డబ్బంతా కొట్టేయొచ్చనుకున్నాడు. కరెన్సీని మార్చాలంటూ ఆ ఫేక్ యువతి చెప్పడంతో చివరకు రూ.7 లక్షలకు అతడికి టోపీ పడింది.
- ఇవే కాకుండా పలు ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్ కేర్ల పేర్లతోనూ మోసాలు జరుగుతున్నాయి.



గురుగ్రామ్‌లో శ్రీకాకుళం పోలీసులు (ఫైల్ చిత్రం)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలు అవే తగ్గుతాయి. మా దగ్గర కొచ్చే నేరాల్లో జాబ్ ఫ్రాడ్, లాటరీ, ఆన్‌లైన్ టాస్కులు, ఎలక్ట్రిసిటీ బిల్లులు, కేవైసీ అప్‌డేట్‌లు ఎక్కువగా ఉన్నాయి.

– పప్పల శ్రీనివాసరావు, సీఐ, శ్రీకాకుళం టూటౌన్

విజ్ఞులే అధికం..

పల్లెల్లో పెద్దగా మోసాలు జరగకున్నా పట్టణాల్లో విజ్ఞులైన వారే మోసపోతున్నారు. ఎస్పీ ఆదేశాలతో విద్యాసంస్థల్లో, గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. సర్కిల్ పరిధి 10 వరకు కేసులు చార్జిషీట్ సిద్ధం చేశాం.

– లెంక సన్యాసినాయుడు, సీఐ, శ్రీకాకుళం వన్‌టౌన్

సైబర్ నేరాలు అరికట్టేందుకు..

సైబర్ నేరాలను అరికట్టేందుకు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న నేరస్తులను గుర్తించేందుకు బృందాలను పంపించాం. 60 కేసుల వరకు చార్జిషీట్లు సిద్ధం చేశాం. ప్రజలు మరింత అప్రమత్తతతో ఉండి సైబర్ వలలో పడకుండా జాగ్రత్త పడాలి. మోసానికి గురైన తక్షణమే 1930కు ఫోన్ చేసి సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇస్తే వారి అకౌంట్లు ఫ్రీజ్ చేసి రికవరీ చేసేందుకు వీలుంటుంది.

– జీఆర్ రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం



హరియాణా ఎన్‌యూహెచ్‌లో స్థానికులను విచారిస్తున్న శ్రీకాకుళం పోలీసులు (ఫైల్)

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: శ్రావణ మాసం ఆదివారం మతత్రయ ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు.

ఫ్లోరింగ్ కోసం రూ. లక్ష విరాళం



విరాళ నగదును సీనియర్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న దాత వెంకటేష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉచిత దర్శన భక్తుల క్యూకాంప్లెక్స్‌లో ఫ్లోరింగ్ కోసం అల్లు వెంకటేష్ రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. ఆదివారం ఆయన విరాళ నగదును ఆయన తల్లిదండ్రులు అల్లు హటకేశం, గుణవతమ్మల పేరిట విరాళంగా ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, బిఎస్.చక్రవర్తి, నేతేటి హరిప్రసాద్‌శర్మ తదితరులున్నారు.

క్లుప్తంగా

చంపావతిలో వృద్ధుడి మృతదేహం


మృతదేహాన్ని బయటకి తీస్తున్న ఫైర్‌సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద గ్రామంలో గల చంపావతి నదిలో ఆదివారం ఉదయం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. దీనిపై ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుర్ల మండలం సాలిపి సోమరాజుపేట గ్రామానికి చెందిన వృద్ధుడు కర్రోతు అక్కునాయుడు(73) శనివారం సాయంత్రం స్నానానికి సమీపంలో ఉన్న చంపావతి నదికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారి పడిపోయి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు, ఫైర్‌సిబ్బంది గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం సుమారు 8గంటల ప్రాంతంలో నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మొయిద జంక్షన్ వద్ద నదిలో మృతదేహం లభ్యమైంది. ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు.

హార్పిక్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అచ్చియ్యమ్మ

పార్వతీపురంటౌన్: వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన మహిళ హార్పిక్ తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రౌతు అచ్చియమ్మకు పెళ్లై 40సంవత్సరాలైంది. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అత్తాకోడళ్ల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండడంతో మనస్తాపం చెందిన అచ్చియ్యమ్మ ఇంట్లో ఉన్న బాత్‌రూం క్లీనర్ హార్పిక్‌ను తాగేసి వాంతులు చేసుకుంటుండడంతో కుటుంబసభ్యులు విషయం తెలుసుకున్నారు. వెంటనే వీరఘట్టం పీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

160 లీటర్ల సారా, బైక్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర

పార్వతీపురంటౌన్: సారా అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి మండలంలో 160 లీటర్ల సారా, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెదమరికి గ్రామ సమీపంలో మాటు వేసి సారాను ద్విచక్ర వాహనానంపై రవాణా చేస్తున్న రెల్లివీధికి చెందిన వినోద్‌ను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఒడిశా రాష్ట్రానికి చెందిన సారా సరఫరాదారు చంద్రయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్సై వీవీ రమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశ తేదీల్లో మార్పు

వీరఘట్టం: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశ తేదీల్లో స్వల్ప మార్పులు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో భాషోత్సవాలు, ఇతర కార్యక్రమా లు ఉండడంతో ఈ నెల 30, 31 తేదీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను మార్చినట్లు ఆయన తెలిపారు. తొలుత ప్రకటించిన పాఠశాలల్లోనే యథావిధిగా కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గమినించాలని కోరారు.

క్రీడలతో ఆత్మరక్షణ

బొబ్బిలి: క్రీడలు మానసిక, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మరక్షణకు దోహదపడతాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయు డు అన్నారు. పట్టణంలోని శ్రీకళాభారతి ము న్సిపల్ ఆడిటోరియంలో 16వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే మాటాడుతూ ఇటువంటి పోటీలు తరచూ నిర్వహిస్తూ విద్యార్థులు, యువత లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శంబంగి వేణు గోపాలనాయుడు, కోచ్ బంకురు ప్రసాద్, ము న్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పిస్తున్న 'ఫిష్ ఆంధ్ర'

- జిల్లాలో 69 షాపుల ఏర్పాటు
- 53 షాపులకు రూ.30.23 లక్షల రాయితీ
- 10 శాతం లబ్ధిదారు భరించాలి


బొబ్బిలి మండలం కలువరాయిలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర షాపు

విజయనగరం ఫోర్ట్: ఫిష్ ఆంధ్ర షాపులు ఉపాధి కల్పిస్తున్నాయి. దీంతో వాటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఫిష్ ఆంధ్ర షాపులు మరిన్ని ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. చేపల వినియోగాన్ని పెంచడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర షాపులను ఏర్పాటు చేయిస్తోంది. జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 24 కిలోమీటర్లు ఉంది. అలాగే మైదాన ప్రాంతంలో చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు అధికంగానే ఉన్నాయి. మత్స్యకారులు చేపల వేటే జీవానధారంగా జీవిస్తున్నారు. కుటుంబ పోషణ కోసం నిత్యం చేపల వేట సాగిస్తారు. మత్స్యకారులు వేట ద్వారా పట్టిన చేపలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. చాలా కొద్దిమంది మాత్రమే జిల్లాలో చేపలను తింటున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర షాపులను ఏర్పాటు చేసి అన్ని చేపలను, పచ్చళ్లు, పొడర్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఫిష్ ఆంధ్ర షాపుల్లో చేపలు తాజాగా ఉండడంతో కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అంతేకాకుండా ఏ సమయంలోనైనా చేపలు అందుబాటులో ఉండడంతో చేపల విక్రయాలు మెరుగ్గా ఉన్నాయి.

జిల్లాలో 69 షాపులు

జిల్లాలో ఫిష్ ఆంధ్ర షాపులు 69 ఏర్పాటు చేశారు. వీటిలో రూ. 60 వేల నుంచి రూ.3.30 లక్షల వరకు షాపులు ఉన్నాయి. వాటిలో 53 షాపులకు ప్రభుత్వం రూ.30.23 లక్షల రాయితీ కూడా చెల్లించేసింది.

40 శాతం రాయితీ

ఫిష్ ఆంధ్ర షాపులకు ప్రభుత్వం 40శాతం రాయితీ ఇస్తుంది. 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తారు. షాపు నిర్వాహకుడు 10 శాతం భరించాల్సి ఉంటుంది.

ఫిష్ ఆంధ్రలో ఉండే పరికరాలు

చేపలు తాజాగా ఉండేందుకు లైవ్‌ఫిష్ ట్యాంక్‌లో వేసి ఆక్సిజన్ ట్యాంక్ ద్వారా ఆక్సిజన్ పంపిస్తారు. దీని వల్ల చేపలు చనిపోకుండా బతికి ఉంటాయి. కాటా టేబుల్, కటింగ్ టేబుల్, డిస్‌ప్లే టేబుల్, సింక్, 2 రోటోమోటెడ్ బాక్సులు ఉంటాయి.

అన్ని రకాలు చేపలు లభ్యం

ఫిష్ ఆంధ్ర షాపులో చెరువు చేపలు, సముద్రపు చేపలు, చెరువు రొయ్యలు, సముద్రపు రొయ్యలు ఇలా అన్ని రకాలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా చేప, రొయ్య పచ్చళ్లు, పొడర్లు, మసాలాలు కూడా షాపులో దొరుకుతాయి.

వ్యాపారం బాగుంది



ఫిష్ ఆంధ్ర షాపులు మూడు పెట్టాను. తాజా చేపలు దొరుకుతుండడంతో ప్రజలు చేపలు ఎక్కువగా కొనుగోలు చేస్తుండడంతో వ్యాపారం బాగుంది.
– బర్రి అంజి, రామభద్రపురం

నెలకు రూ. 30 వేల ఆదాయం



శనివారం మినహా మిగిలిన అన్ని రోజులూ చేపల వ్యాపారం బాగుంటుంది. ఖర్చులు పోను నెలకు రూ. 30 వేల వరకు ఆదాయం వస్తుంది.
– పెరుగంటి కృష్ణ కలువరాయి

ఫిష్ ఆంధ్ర షాపులకు ఆదరణ



ఫిష్ ఆంధ్ర షాపులకు ఆదరణ బాగుంది. జిల్లాలో ఇప్పటి వరకు 69 ఏర్పాటు చేశాం. ఇంకా మరిన్ని షాపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ముందుగానే రాయితీని అందిస్తుంది.
– పి.సత్యనారాయణ, మత్స్యశాఖ డీడీ

డిజిటల్ వైపు అడుగులు

రామభద్రపురం: శారీరక వైకల్యంతో బాధపడుతూ తోటి పిల్లలతో సమానంగా చదువుకోలేక తల్లడిల్లే చిన్నారుల బంగారు భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దివ్యాంగ విద్యార్థులకు సేవలందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ద్వారా వారు త్వరగా కోలుకునేలా ఫిజి యోథెరిపిస్టులతో క్రమం తప్పకుండా ఫిజియోథెరి పి చేయిస్తున్నారు. పిల్లల బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించి వారికి సేవలందిస్తుంది. ఆర్టీలతో వారికి అవసరమైన విద్యాబోధన చేస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి 7 నుంచి 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు మరింత సులువుగా చదువుకునేందుకు ప్రత్యేక యాప్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ప్రత్యేక డిజిటల్ బోధనకు సిద్ధం

దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డి ప్రత్యేక డిజిటల్ విద్యాబోధన చేసేందుకు నిర్ణయించారు. పాఠశాలల్లోని సాధారణ విద్యార్థుల తో సమానంగా ప్రత్యేక అవసరాల పిల్లలను సాంకేతికంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 209 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయ నున్నట్లు అధికార సమాచారం. ఇప్పటికే జిల్లా సహి త విద్యా కేంద్రాలకు ట్యాబ్‌లు చేరుకున్నాయి. గతే దాది 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేయగా వారితో పాటు దివ్యాంగ విద్యార్థులకూ అందించారు. అయితే అవి ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధనకు అనువుగా ట్యాబ్‌లో సాఫ్ట్‌వేర్ లేకపోవడంతో ఈ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం వాటి స్థానంలో వినికిడి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులందరికీ ఉపయోగపడేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ పొందుపరిచిన ట్యాబ్‌లను పంపిణీ చేయనుంది. దీంతో వా రికి మరింత సులువుగా విద్యాబోధన జరగనుంది.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పొందుపరిచిన ట్యాబ్‌ల ద్వారా సాంకేతిక విద్యాబోధన చేసేందుకు వీలుగా ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనుంది. ఇందు కోసం జిల్లాలో 10 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు ఇటీవల అనంతపురంలో మాస్టర్ ట్రైనీలుగా శిక్షణ పొందారు. వీరు జిల్లాలోని భవిత కేంద్రాలలో ఐఈఆర్టీలకు, పాఠశాలల్లో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో పాటు ప్రత్యేక ఉపాధ్యాయులకు ఈ ట్యాబ్‌లు ఉచితంగా ఇవ్వనున్నారు.

బిల్డింగ్‌పై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య


ఆర్ట్స్ కళాశాల పైనుంచి దూకిన తర్వాత విద్యార్థి లక్కయ్


విద్యార్థి రాసిన సూసైడ్ నోట్


రిమ్స్‌లో మృతదేహం పోస్టుమార్టం వద్ద ఎస్ఐ లక్ష్మి

శ్రీకాకుళం క్రైమ్: 'తండ్రీ యేసు ప్రభువా.. నన్ను క్షమించు.. నా చావు నేనే డిసైడ్ చేసుకున్నా.. ఈ దేశంలో నేనే అందర్నీ మోసగించా.. నేను చేసిన నేరాలకు అందరూ క్షమించండి'.. అంటూ సూసైడ్ లెటర్ రాసి ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రమైన మానసిక ఆందోళనతో బాధ పడుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మన్యం (పార్వతీపురం) జిల్లా సీతంపేట మండలం సంకిలి గ్రామానికి చెందిన ఊయక లక్కయ్ (20) శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ ఎస్ఐ కె.లక్ష్మి, స్థానికులు, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. లక్కయ్ శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ యర్‌లో ఈ జూన్‌లో చేరాడు. ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు పోడు వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే జీవిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల కిందట లక్కయ్ ఊరెళ్లగా కుటుంబ సభ్యులంతా సెలవులపై వచ్చాడనుకున్నారు. కానీ లక్కయ్ డల్‌గా కనిపిస్తూ రాత్రి పూట బైబిల్ చదువుతూ పరధ్యానంగా ఉండేవాడు. దీంతో సోదరుడు రాజేష్ లక్కయ్‌ను ప్రశ్నించగా తనకు చదువుపై ఇంట్రస్ట్ లేదని చెప్పాడు. ఈ నెల 25న చర్చికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన లక్కయ్ తిరిగి ఇంటికి వెళ్లలేదు. బంధువుల ఇంటికి వెళ్లుంటాడులే అని కుటుంబ సభ్యులంతా భావించారు.

ఈ నేపథ్యంలో లక్కయ్ ఆదివారం కాలేజీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే గ్రౌండ్‌లో ఆడుకుంటున్న కుర్రాళ్లకు శబ్దం వినిపించడంతో వెళ్లి చూడగా.. లక్కయ్ నిస్సహాయంగా చూస్తూ కనిపించాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ కన్ను మూశాడు. అంతకుముందే వసతి గృహంలో పనిచేస్తున్న వై.అప్పలరాజు లక్కయ్ అన్నయ్య రాజేష్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. లక్కయ్ వారం రోజులుగా హాస్టల్‌లో లేడని, ఈ రోజు ఉదయం ఆర్ట్స్ కళాశాల మీద నుంచి దూకేశాడని.. రిమ్స్‌లో చేర్పించామని, చేతిలో ఏదో సూసైడ్ నోట్ రాసి ఉందని చెప్పారు. దీంతో వారంతా రిమ్స్‌కు చేరుకుని సూసైడ్ లెటర్‌ను చూడగా.. 'జీసస్ ఈజ్ మై ఎవ్రీథింగ్.. ఐలవ్యూ జీసస్.. ఫర్ యెవర్ ఫర్ యెవర్.. తండ్రీ యేసు ప్రభువా.. నన్ను క్షమించు.. నా చావు నేనే డిసైడ్ చేసుకున్నా.. ఈ దేశంలో నేనే అందర్నీ మోసగించా.. నేను చేసిన నేరాలకు అందరూ క్షమించండి' అని రాసి ఉంది. ఈ విషయమై రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మిని వివరణ కోరగా విద్యార్థి సైకలాజికల్‌గా ఇబ్బంది పడుతూ ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని.. మేడ మీద నుంచి దూకడం వలన ఊపిరితిత్తులు ఛిద్రమయ్యాయని మిగతా భాగాల్లో ఎక్కడా గాయాలు లేవని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం పూర్తయ్యిందని చెప్పారు.

వైభవంగా ఆదిత్య హృదయ హోమం


యాగశాలలో ఆదిత్య హృదయ హోమాన్ని జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి వేకువజామున ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం యాగశాలలో లోక కల్యాణార్థం ఆదిత్య హృదయం హోమాన్ని వైభవంగా జరిపించారు. ప్రత్యేక హోమాల్లో భాగంగా సుందరకాండ హవనం, సుదర్శన అష్టక హవ నం కార్యక్రమాలను వైదిక సిబ్బంది శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారామచంద్రుల నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తుల కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యాపకుని పరిశోధన ప్రదర్శనకు జాతీయ స్థాయి ప్రశంసలు

విజయనగరం అర్బన్: రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జోగ చంద్రశేఖర్ పరిశోధనా ప్రదర్శనకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. నవోదయ లీడర్ షిప్ ఇనిస్టిట్యూట్ (ఎన్ఎల్ఐ) ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు రంగారెడ్డి నవోదయ విద్యాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ స్థాయి పరిశోధన ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చూపిన ఆయన ప్రదర్శనలకు గుర్తింపు లభించిందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు రాష్ట్రాల నవోదయ విద్యాలయాల పరిధిలోని భౌతిక శాస్త్ర పీజీటీలు పాల్గొన్న ఈ ప్రదర్శనలో యాంత్రిక శాస్త్రం, అయస్కాంతత్వం, కాంతి, ఉష్ణం, విద్యుత్ మరియు విద్యుదయస్కాంతత్వం వంటి భౌతిక శాస్త్ర పాఠ్యాంశాలపై అవగాహన కలిగించే ప్రదర్శనలు ఉంచారు. తక్కువ ఖర్చుతో కూడిన మెటీరియల్స్‌తో మానవ జీవన అవసరాలకు సంబంధించిన పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. రాకెట్ లాంచింగ్ విధానం కాంతి విద్యుత్ ఫలితం వంటి ప్రత్యేక ఆకర్షణీయ ప్రదర్శన నిర్వహించారు. చంద్రశేఖర్‌కు చివరి రోజున నవోదయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్, ఎన్ఎల్‌టీ రంగారెడ్డి జిల్లా అధికారి వి.జగదీశ్వరాచారి, భౌతిక శాస్త్ర నిపుణులు ప్రొఫెసర్ బిందు అనుభబాంబాహా అభినందలు, ప్రశంసాపత్రం అందజేశారు.

వైభవంగా సీతారాముని విగ్రహ ప్రతిష్ఠ


యాగశాలలో హోమంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నీలంరాజుపేట గ్రామంలో టీటీడీ శ్రీ వాణి ట్రస్టు ఆర్థిక సహాయంతో నిర్మించిన సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్టాపన పూజలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఆలయంలో గడిచిన రెండు రోజుల నుంచి విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు జరిపించారు. గ్రామస్తులు కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో సీతారామస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేకువజామున నుంచి స్వామి సన్నిధిలో విశేష హోమాలు చేసి స్వామికి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సీతారామస్వామిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ గర్భగుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సమరసత ఫౌండేషన్ జిల్లా మహిళ కన్వీనర్ సుంకరి లక్ష్మి మాట్లాడుతూ టీటీడీ శ్రీ వాణి ట్రస్టు సమకూర్చిన రూ.10లక్షల నిధులతో ఆలయాన్ని నిర్మించామని తెలిపారు. తిరుముల తిరుపతి దేవస్థానం సహకారంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు కావడం శుభపరిణామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధికి మన బెల్లం


తిరుమల తిరుపతి దేవస్థానానికి బెల్లం సరఫరా చేసే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- తిరుపతికి సేంద్రియ బెల్లం
- జెండా ఊపి వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి:

తిరుమల తిరుపతి దేవస్థానాలకు లడ్డూ ప్రసాదం, ఇతర వంటకాల్లో వినియోగించేందుకు బొబ్బిలి నియోజకవర్గంలో సేంద్రియ విధానంలో పండించిన చెరకు నుంచి అదే విధానంలో తయారు చేసిన బెల్లాన్ని తరలించేందుకు అవకాశం రావడం ఈ ప్రాంత వాసుల అదృష్టమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఇక్కడి తయారీదారుల నుంచి తిరుమల తిరుపతి వెళ్లేందుకు బయలుదేరిన బెల్లం వాహనాన్ని ఆయన జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని రైతు సాధికార సంస్థ, ఏపీసీఎన్ఎఫ్ మార్క్‌ఫెడ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ బెల్లాన్ని సేకరించినట్టు చెప్పారు. మన నియోజకవర్గంలోని ముగడ, కోమటిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తయారు చేసిన 2,650 కిలోల బెల్లాన్ని సరఫరా చేయడం గొప్ప విషయమన్నారు. జిల్లాకు ఇదొక మంచి అవకాశమని అన్నారు. దీన్ని రైతులు గుర్తించి భవిష్యత్‌లో మరింత సరఫరా చేసేందుకు సిద్ధం కావాలన్నారు. వాహనం తిరుమల తిరుపతి చేరుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, గొట్టాపు సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వాండ్రాసి లక్ష్మి, శంకరరావు, రైతులు అట్టాడ తిరుపతి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పూర్తి


అండర్-11,13,15 విభాగాల్లో విజేతలుగా నిలిచిన బాలికలు

- అండర్-11,13,15 విభాగాల్లో విజేతలకు మెడల్స్ అందజేత

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. నగర శివారులో గల ఎపిక్ బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుంబచ్చన్ ఆధ్వర్యంలో అండర్-11, 13, 15 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరుకాగా..వారికి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం వరకు జరిగిన బాలికల అండర్-11 సింగిల్స్ విభాగంలో ఎస్.లాస్యశ్రీ, వై.భవ్యశ్రీలు మొదటి, రెండవ స్థానాల్లో నిలవగా..డబుల్స్ విభాగంలో ఎస్. లాస్యశ్రీ-బి.లాస్య, కె.జాస్మిత-హెచ్ శ్రీలోహిత జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్-13 బాలికల సింగిల్స్ విభాగంలో ఎండి.నిషాద్‌ఫాతిమా, ఎస్.లాస్యలు ప్రథమ, ద్వితీయ స్థానాలు చేజిక్కించుకోగా..డబుల్స్ విభాగంలో ఎస్.లాస్య- ఎం.డి.నిషాద్ ఫాతిమా జట్టు మొదటి స్థానం, బి.లాస్య, ఎస్. లాస్యశ్రీ జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో ఎం.సంజన మోల్, ఎస్.దాక్షణ్యలు మొదటి రెండు స్థానాలు కై వసం చేసుకోగా..డబుల్స్ విభాగంలో ఎం.సంజన మోల్-ఎండి నిషాద్ ఫాతిమాల జట్టు, ఎస్.దాక్షణ్య-ఎం.ఉజ్వల జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్‌లను నిర్వాహకులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్-11 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 14 నుంచి 17వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా మల్కిపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అలాగే అండర్-13 విభాగంలో ఎంపికై న క్రీడాకారులు వచ్చే నెల 7,8,9,10 ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే ..అండర్-15 విభాగంలో ఎంపికైన వారు విశాఖలో ఈనెల 31 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్ తెలిపారు. బాలుర ఎంపిక పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారుల వివరాలు తెలియాల్సి ఉంది.

డిప్యూటీ స్పీకర్‌కు క్రీడాకారుల కృతజ్ఞతలు

మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించిన ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి క్రీడాకారులు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపిక పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు.

నిత్య సాధనతో నైపుణ్యం

క్రీడాకారులు నిత్యం సాధన చేసి వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా.వీఎస్.ప్రసాద్, నున్న సురేష్, కోశాధికారి అశోక్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, పలువురు కోచ్‌లు, జిల్లా నలు మూలలనుంచి హాజరైన క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా అంతర్ జిల్లా కరాటే పోటీలు

కొత్తవలస:

సినీహీరో సుమన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్తవలస మండల కేంద్రంలో గల ఏపీఎన్‌జీఓ కార్యాలయం హాల్‌లో ఆదివారం నిర్వహించిన సుమన్ కప్-2023 అంతర్ జిల్లా కరాటే పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో 200మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చీఫ్ ఆర్గనైజర్ బీవీ అప్పారావు తెలిపారు. బెల్ట్ గ్రూప్ వారీగా పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి మెడల్స్ ప్రదానం చేశామని తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎ.లక్ష్మణరావు, జి.గోపాలరావు, కె.సంతోష్, కె.సూరి నూకరాజు తదితరులు వ్యవహరించారు.


కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు